క్లుప్తంగా

నేడు సీఆర్సీకి మంత్రి కాకాణి రాక

వెంకటాచలం : మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న కాంపోజిట్ రీజనల్ సెంటర్ (సీఆర్సీ)కు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సీఆర్సీకి చేరుకుని దివ్యాంగులకు పరికరాలు అందజేస్తారని తెలియజేశారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు


రాధా కృష్ణుల ఉత్సవ విగ్రహాలకు పల్లకిసేవ

వెంకటాచలం : వెంకటాచలంలోని రాధేరాధే కృష్ణ మందిరంలో రాధాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాధా రాణి పుట్టినరోజు సందర్భంగా రాధా కృష్ణుల మూలవిరాట్‌కు అభిషేకలు నిర్వహించి పూజలు చేశారు. రాధా కృష్ణుల ఉత్సవ విగ్రహాలకు పల్లకిసేవ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో కమిటీ సభ్యులు మనోజ్ గుప్తా, వరదగల్లు హరిబాబు, పుత్తూరు వెంకటరత్నం, మందిపాటి రమేష్‌బాబు, చల్లా రమణయ్య, గజ్జల శంకరమ్మ, శివ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం


పొలాల రైతులతో సర్వేయర్

మనుబోలు : రీసర్వే ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం అన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని జట్లకొండూరు గ్రామ పొలాలను సర్వేయర్ రాజా ఆధ్వర్యంలో శనివారం సర్వే చేశారు. పొలాలకు సంబంధించి అనుభవంలో ఉన్న రైతులు వారి డాక్యుమెంట్లతో రెవెన్యూ సిబ్బందికి సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు రీసర్వేతో పరిష్కారం లభిస్తుందన్నారు. భూముల వివరాలను పక్కాగా సర్వే చేసి రెవెన్యూ రికార్డుల్లో పొందుపరుస్తామని సర్వేయర్ రాజా తెలిపారు.

కొనసాగుతున్న పోలీస్ బందోబస్తు


ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

కోవూరు(విడవలూరు) : మండలంలోని ముదివర్తి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా చెలరేగిన ఇరువర్గాల గొడవ నేపథ్యంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు పోలీస్ పికెటింగ్ కొనసాగింది. ఈ సందర్భంగా ఇరువర్గాల వారిని డీఎస్పీ పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలకు దూరంగా ఉండాలంటూ హితవు పలికారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. వీరి వెంట సీఐ గంగపట్నం రామారావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సేవలపై నోడల్ టీమ్ సర్వే


సర్వే చేపడుతున్న నోడల్ అధికారుల బృందం

ఇందుకూరుపేట : నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమరిక గ్రామంలో నోడల్ అధికారులు శనివారం సర్వే చేపట్టారు. ఆరోగ్య సేవలను మెరుగు పరిచే కార్యక్రమంలో భాగంగా సర్వే చేపట్టినట్లు స్పెషల్ టీమ్ సభ్యులు టి.రాజయ్య, సీహెచ్ సుధాకర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య శాఖ ద్వారా అందించే పథకాలు, ప్రయోజనాలు, పలు వ్యాధుల గురించి ప్రజలకు తెలుస్తున్నాయా లేదా.. అని అడిగి తెలుసుకొంటున్నట్లు చెప్పారు. ప్రధానంగా ఆరోగ్యశ్రీ, బీమా తదితర విషయాలపై ఆరా తీశారు.

న్యాయస్థానాల్లో పోరాడి పేదలకు ఇళ్ల స్థలాలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


నివేశన పట్టాను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : పేదలకు ఇంటి నివేశన స్థలాలు అందజేస్తుంటే ఓర్వలేక టీడీపీ నేతలు న్యాయస్థానాలకు వెళ్తే అక్కడ న్యాయపోరాటం చేసి విజయం సాధించి ఇళ్ల స్థలాలు అందజేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిపర్తి పంచాయతీ వరదాపురంలో 54 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీలో నివేశన స్థలాల పట్టాలను మంత్రి చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇళ్లకు మంత్రి చేతుల మీదుగా భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ తాటిపర్తిలో 2.50 ఎకరాల్లో జగనన్న లేఅవుట్ నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తే సైదాపురానికి చెందిన వ్యక్తి వద్ద టీడీపీ నాయకులు న్యాయపరమైన అడ్డంకులు సృష్టించినట్లు తెలిపారు. మండలంలోని తాటిపర్తి, కసుపర్తి, సూరాయపాళెం, మరుపూరు గ్రామాల్లో జగనన్న లేఅవుట్లకు అడ్డుపడి న్యాయస్థానాలకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే న్యాయపరమైన చిక్కులను అధిగమించి పేదలకు నివేశన స్థలాలను అందజేస్తున్నట్లు తెలిపారు. తాటిపర్తిలో మరో 20 ప్లాట్లు ఉన్నాయని అర్హులైన వారికి అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు 26 పంచాయతీల్లో జగనన్న లేఅవుట్లను నిర్మించి ఇళ్ల స్థలాలను అందజేశామన్నారు. న్యాయపరమైన ఇబ్బందుల వల్ల నాలుగు పంచాయతీల్లో జాప్యం జరిగిందన్నారు. పక్కా ఇళ్లను వేగంగా నిర్మించుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం వినతిపత్రాలు స్వీకరించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పొదలకూరు పార్టీ నేతలు, కార్యకర్తలకు మంత్రి కాకాణి దిశానిర్దేశం చేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేసేవారికే భవిష్యత్తు ఉంటుందన్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాల్సిందిగా సూచించారు. గీత దాటే వారిపై చర్యలు తప్పవన్నారు. వార్డుసభ్యులు వారి పరిధిలో పార్టీ వ్యవహారాలు చూసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఒక్క పొదలకూరు పంచాయతీలోనే మౌలిక వసతుల కోసం రూ.50 కోట్ల మేరకు నిధులు వెచ్చించామని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీలు సోమా అరుణ, వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు పామూరు లచ్చారెడ్డి, పలుకూరు పోలిరెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, డి.మురళీకృష్ణారెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, శ్రీహరి, నీలం హనుమారెడ్డి, పార్లపల్లి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్


మనుబోలు : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న రమణమ్మ


పొదలకూరు : గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి

మనుబోలు : మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే రక్తహీనత సమస్యను అధిగమించగలమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పోషణ్ మహా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వెంకన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతకు గురవుతారన్నారు. ఆకుకూరలు, తాజా పండ్లు, గుడ్లు, పాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం ఎలా తయారు చేయాలో వివరించారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.పెంచలమ్మ, ఎంఎస్‌కే సునీత, ఏఎన్ఎం ఇంద్రసేన, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పొదలకూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని వెంకటాచలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఇనుకుర్తిలో పోషణ్ మాసోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతను ఎదుర్కొనేందుకు రాగులు, జొన్నలు, సజ్జలు, వేరుశనగ చిక్కీలు, ఆకుకూరలు, కోడిగుడ్లను సమపాళ్లలో తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం వీటి ద్వారా లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఆరేళ్లలోపు పిల్లల బరువు చూడాల్సిందిగా సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సమావేశంలో హెచ్ఎం ఈ.జయధరణ్, ఎంఎస్‌కే దిల్‌షాద్, ఏఎన్ఎం మేరీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


ఇందుకూరుపేట : మైపాడులో..

- ఇందుకూరుపేట : గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని మైపాడు బీచ్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు శనివారం జరిగాయి. తొలుత ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపారు.

తప్పులు చేయడం సోమిరెడ్డి నైజం

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య


ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటాచలం : తప్పుడు పనులు చేయడం సోమిరెడ్డి నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య అన్నారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసును అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు సంబంధించి 11,291 ఓట్లను తొలగించడానికి టీడీపీ కుట్రలు చేస్తోందని, అర్హత లేని టీడీపీ సానుభూతిపరుల ఓట్లు చేర్చే ప్రయత్నాలు చేస్తోందన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం వెంకటశేషయ్య విలేకరులతో మాట్లాడుతూ వరుస ఓటములతో కుంగిపోయిన సోమిరెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ ఓట్లను తొలగించే ప్రయత్నం చేయడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. వెంకటాచలంలో టీడీపీ చేపట్టే దీక్షలో పది మంది కూడా హాజరుకాకపోవడం సోమిరెడ్డి దయనీయస్థితికి అద్దం పడుతోందన్నారు. మంత్రి కాకాణిని విమర్శించే స్థాయి రాజగోపాల్‌రెడ్డికి లేదన్నారు. ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రసాద్, చిన్నపరెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఉప్పల శంకరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


మనుబోలు : చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


కొడవలూరు : బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

మనుబోలు : మండలంలోని వడ్లపూడి గ్రామానికి చెందిన పట్టు విజయమ్మ కుటుంబానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం అందజేశారు. ఆరు నెలల క్రితం విజయమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్షల్లో ఖర్చు అయింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బత్తల వెంకటేశ్వర్లు మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేయించారు. దీనిని నెల్లూరులో కాకాణి చేతుల మీదుగా విజయమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టేటి పెంచలయ్య, ఉప్పల పొందయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షలు

కొడవలూరు : మండలంలోని దామేగుంట దళితవాడకు చెందిన వలంటీర్ విష్ణుప్రియ ఇటీవల మనుబోలు క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. ఆమెతో పాటు కుమారుడు కూడా మృతిచెందగా, భర్త దుర్గాప్రసాద్, కుమార్తె ప్రాణాలతో బయటపడ్డారు. వీరికి తనవంతు సాయపడతానని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయిన ఎమ్మెల్యే రూ.5 లక్షలను మంజూరు చేయించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో దామేగుంటలోని వారి నివాసానికి వెళ్లి శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేతలు చిమటా శేషగిరి, కొట్టే మల్లికార్జున, అనికేపల్లి వెంకటరత్నం, ఆరికొండ సుధాకర్, మాలతి పాల్గొన్నారు.

దళిత ద్రోహి సోమిరెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు కృష్ణ

వెంకటాచలం : రాజకీయంగా దళితులను అణగదొక్కుతూ సోమిరెడ్డి దళిత ద్రోహిగా మిగిలిపోయారని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు మందా కృష్ణ విమర్శించారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీసెల్ నేతలతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో కులాల మధ్య చిచ్చుపెట్టడం, రాజకీయంగా దళితులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో సర్వేపల్లిలో తమకు సరైన గుర్తింపు లభించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దళితులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రామాల్లో దళితుల మధ్య చిన్న వివాదం జరిగితే దానిని కాకాణికి ఆపాదించడం సోమిరెడ్డి నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సర్వేపల్లిలో దళితులకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ పదవులు ఇచ్చిన ఘనత మంత్రి కాకాణికి మాత్రమే దక్కుతుందన్నారు. ఎంపీపీ మందా కవిత, చీకుర్తి నరసయ్య, తాటిపర్తి సురేష్ పాల్గొన్నారు.

వినలేని వారికే సంకేత భాష


మాట్లాడుతున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ స్రవంతి

ముత్తుకూరు : వినలేనివారు, మాట్లాడలేనివారి కోసం ఏర్పడిందే సంకేత భాష అని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎం.స్రవంతి అన్నారు. అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవాన్ని హైస్కూల్‌లో శనివారం జరుపుకున్నారు. హెచ్ఎం శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వినికిడి లోపం ఉన్న వారు, మాట్లాడలేని వారు సంజ్ఞలు, సంకేతాల ద్వారా మాట్లాడుకోవచ్చని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో సంకేత భాషలున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 వరకు సంకేత భాషలున్నట్లు అంచనా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సంజ్ఞల ద్వారా మాట్లాడుకోవడం చేసి చూపించారు.

విరువూరులో ఆయుర్వేద మెడికల్ క్యాంప్


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పొదలకూరు : మండలంలోని విరువూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆయుర్వేద మెడికల్ క్యాంపును డాక్టర్ వినోద్‌బాబు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కాలనీవాసులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. షుగర్, బీపీ, పక్షవాతం, ఆయాసం వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చెల్లాయపాళెంలో పిడుగుపాటు

- గృహోపకరణాలు ధ్వంసం

కోవూరు (బుచ్చిరెడ్డిపాలెం) : మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. కాగా గ్రామంలో మురళి అనే వ్యక్తి నివాసంపై పిడుగుపడడంతో గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా.

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం


రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : రైతుల దశాబ్దాల సమస్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపినట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలో రీసర్వే ద్వారా 620 మంది రైతులకు సంపూర్ణ హక్కులతో రూపొందించిన పట్టాదారు పాసుపుస్తకాలను యల్లాయపాళెంలో ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకుని జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపారన్నారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న 2.06 లక్షల ఎకరాలను 22ఏ నుంచి తొలగించి సంపూర్ణ హక్కులతో రైతులకందించారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో 2,673 ఎకరాల భూములకు పరిష్కారం లభించిందన్నారు.

వేషగాళ్లను నమ్మొద్దు

నాలుగున్నరేళ్లుగా కనిపించని వారు దసరా వేషగాళ్ల లెక్కలో ప్రజల్లోకి వచ్చి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే ప్రసన్న విమర్శించారు. కరోనా సమయంలో ప్రజలు ఎలా ఉన్నారో కూడా వీరు చూడలేదని గుర్తుచేశారు. మాట నిలబెట్టుకునే జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. తొలుత రామాపురంలో రూ.20 లక్షలు, యల్లాయపాళెంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన మూడు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్, ఏపీఎల్డీఏ చైర్మన్‌లు వీరి చలపతిరావు, గొల్లపల్లి విజయకుమార్, తహసీల్దార్, ఎంపీడీఓ రమాదేవి, సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, పార్టీ నేతలు ఇసనాక సునీల్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, ఆర్.రాజేష్‌రెడ్డి, ఎస్కే.మాబాషా, సమీఉద్దీన్ పాల్గొన్నారు.

శిక్షణతో సంఘాల పురోభివృద్ధి

- డీఆర్‌డీఏ డీపీఎం కామాక్షి


శిక్షణ పూర్తి చేసుకున్న సంఘ సభ్యులు, అధికారులు

కొడవలూరు : శిక్షణ నైపుణ్యం ద్వారానే పొదుపు సంఘాల పురోభివృద్ధి సాధ్యమవుతుందని డీఆర్‌డీఏ డీపీఎం కామాక్షి సూచించారు. కొడవలూరు మండల సమాఖ్య జాతీయ స్థాయిలో పురస్కారానికి ఎంపికైన సందర్భంగా 35 సంఘ బంధాలు, వీఓఏలు, సీసీలకు విజన్ మాడ్యూల్-1పై నాలుగు రోజులపాటు ఇచ్చిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో కుటుంబం, గ్రామం, సంఘబంధాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రంగా తెలియజేశామన్నారు. శిక్షణలోని అంశాలను ప్రతి సభ్యురాలికి వివరించడం ద్వారా అన్ని సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయని పేర్కొన్నారు. ఏపీఎం ఎస్.రుక్మిణి, సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరమ్మ, ప్రవీణ, కోశాధికారి సుశీల, సీసీలు ఉదయ్‌కుమార్, మమత, శోభ, శ్రీదేవి, సుకన్య పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనోత్సవం


ముత్తుకూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

మనుబోలు : మండలంలో వినాయక చవితి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాలకు గ్రామోత్సవాలు నిర్వహించి సమీప వాగుల్లో నిమజ్జనం చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నుంచే వివిధ మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు ప్రత్యేక పూజలు చేసి అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు. శివాలయంలోని వినాయక మండపంలో లడ్డూకు వేలం వేయగా శివాలయం యూత్ రూ.40 వేలకు దక్కించుకున్నారు.

గణనాథునికి పల్లకిసేవ

ఇందుకూరుపేట: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఇందుకూరుపేటలో శనివారం మహాగణపతికి పల్లకిసేవ వేడుకగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి పడవపై కొలువుదీర్చి జై బోలో గణేశ్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తూ స్వామివారికి పల్లకిసేవ జరిపారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది. డీసీఎంఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అలాగే మండలంలోని మైపాడు బీచ్‌కు వివిధ ప్రాంతాల నుంచి భారీగా గణనాథులను తీసుకొచ్చారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం జరిపారు.

పెద్ద ఎత్తున

ముత్తుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పండగ సందర్భంగా ప్రతిష్ఠించిన వినాయకుల విగ్రహాలను పెద్ద సంఖ్యలో శనివారం ఊరేగింపుగా నిమజ్జనం చేసేందుకు సముద్రానికి తరలించారు. దీంతో కృష్ణపట్నం వద్ద బంగాళాఖాతం కిక్కిరిసిపోయింది. ముత్తుకూరు ఆర్అండ్ఆర్ కాలనీ, బ్రహ్మదేవి, పంటపాళెం, వల్లూరు, నారికేళపల్లి గ్రామాల నుంచి అందంగా అలంకరించిన వాహనాల్లో వినాయకుడి విగ్రహాలను ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకొంటూ తప్పెట్లు తాళాల మధ్య బాణసంచా కాలుస్తూ విగ్రహాలను బంగాళాఖాతంలో నిమజ్జనం చేశారు. మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఇందుకూరుపేటలో గణనాథునికి పల్లకిసేవ


ఇందుకూరుపేట: మైపాడు బీచ్‌కు తరలివస్తున్న వినాయక ప్రతిమ


మనుబోలు : శివాలయ వినాయకుడి గ్రామోత్సవం

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



కోవూరు (విడవలూరు): ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ సుజాతను సత్కరించారు. వైస్ ప్రిన్సిపల్ మధు, ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.